
సాక్షి కర్నూలు

బుధవారం | 17 | జూలై | 2024



కేసీ కెనాల్‌కు నీటి విడుదల

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు మంగళవారం 256 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, రిజర్వాయర్‌లో 1.235 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి.



సర్వర్ ధమాల్ !

వినియోగదారులు ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. సర్వర్ డౌన్ అవుతుండడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడంలేదు. ▶వివరాలు 8లో..



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్యకళావేదికపై సికింద్రాబాద్‌కు చెందిన లక్ష్మీగణపతి కల్చరల్ ఆర్గనైజేషన్ వారి సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది.

న్యూస్‌రీల్

క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్‌లకు మెమోలు




వివరాలు తెలుసుకుంటున్న ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లకు మెమోలు జారీ అయ్యాయి. మంగళవారం ఆసుపత్రిలోని పలు విభాగాలను కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా క్యాజువాలిటీలో మెడికల్ ఆఫీసర్ల హాజరు పట్టి, సమయపాలనపై ఆరా తీశారు. హాజరుపట్టీలో సంతకాలు లేకపోవడంపై ఇద్దరు మెడికల్ ఆఫీసర్లకు మెమోలు జారీ చేశారు. పలు విభాగాల్లో వైద్యులకు ఆప్రాన్, ఐడీ కార్డు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): మూడు, నాలుగు రోజుల నుంచి వర్షాలు తేలికపాటికే పరిమితమయ్యాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా కర్నూలు అర్బన్‌లో 19.4 మి.మీ, అత్యల్పంగా గూడూరులో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తంగా సగటున 8 మి.మీ వర్షపాతం నమోదైంది. కర్నూలు అర్బన్‌లో 19.4 మి.మీ, పత్తికొండలో 18.6, కర్నూలు రూరల్‌లో 18.2, మంత్రాలయంలో 13.2, కల్లూరులో 13.2, నందవరంలో 12.6, ఎమ్మిగనూరులో 10.6, సీ.బెళగల్‌లో 9.8, మద్దికెరలో 9.6 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ కాగా ఇప్పటి వరకు 30.9 మి.మీ వర్షపాతం నమోదైంది.

జీడీపీలో తగ్గిన నీటి నిల్వ



గాజులదిన్నె ప్రాజెక్టులో తగ్గిన నీరు

గోనెగండ్ల: ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురువకపోవడంతో గాజులదిన్నె ప్రాజెక్టులో నీరు అడుగంటి పోతోంది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీల కాగా.. ప్రస్తుతం 0.95 టీఎంసీలు మాత్రమే ఉంది. మంగళవారం కోడుమూరు పట్టణానికి తాగునీటి కోసం జీడీపీ కుడి కాలువ నుంచి 100 క్యూసెక్కులు, గాజులదిన్నె, హెచ్. కైరవాడి గ్రామాలకు ఎడమ కాలువ నుంచి 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే డోన్, పత్తికొండ, కృష్ణగిరి మండలాలకు తాగునీటి పథకాలకు నీరు సరఫరా అవుతోంది. దీంతో జీడీపీలో రోజురోజుకు నీరు అడుగంటిపోతోంది.

కన్నీళ్లు పారుతున్నాయ్!

విద్యుత్ ఇస్తే పంటలు పండించుకుంటాము



మాకు 8 ఎకరాల భూమి ఉంది. వర్షాధారం కింద సాగు కలసిరాకపోతుండటంతో అప్పులు తెచ్చి బోరు వేసుకున్నాం. నీరు ఆశాజనకంగా పడింది. ఎన్నికల కోడ్ రాక ముందే విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు ఎస్టిమేట్లు చేసి డిమాండ్ నోటీసు ఇచ్చారు.డిమాండ్ నోటీసులో పేర్కొన్న ప్రకారం రూ.లక్షకుపైగా అమౌంటు కూడా చెల్లించాం. విద్యుత్ పోల్స్ నాటారు. అయితే కేబుల్, కండక్టర్, ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదు. మెటీరియల్ కోసం విద్యుత్ అధికారులను రోజూ అడుగుతున్నాం.విద్యుత్ ఇస్తే నీటి సదుపా యం కింద కూరగాయలు, ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలనే లక్ష్యంతో ఉన్నాం.మెటీరియల్ వెంటనే ఇచ్చే విధంగా ప్రభుత్వం చొరువ తీసుకోవాల్సిన అ వసరం ఉంది.

– వి.వీరేష్, సంగాల, కృష్ణగిరి మండలం



ఉచిత విద్యుత్‌తో బోర్ల కింద పంటల సాగు

విద్యుత్ కనెక్షన్‌లకు గ్రహణం

- డబ్బులు చెల్లించి నిరీక్షిస్తున్న 10 వేల మందికి పైగానే రైతులు
- మరో 10వేల మంది వరకు దరఖాస్తు
- ఉమ్మడి విద్యుత్ శాఖ స్టోర్‌లో అందుబాటులో లేని మెటీరియల్
- కాలిపోతే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చే పరిస్థితి కూడా కరువే
- అమలుకు నోచుకోని విద్యుత్ శాఖ మంత్రి మొదటి సంతకం

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడుస్తున్నా ఒక్క విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వలేకపోయింది. విద్యుత్ శాఖ మంత్రిగా గొట్టిపాటి రవి కుమార్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే 40వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేస్తూ మొదటి సంతకం చేశారు. అయితే ఇప్పటికీ అతీగతీ లేకపోవడం గమనార్హం. కనెక్షన్‌ల కోసం వేలాది మంది రైతులు డబ్బు చెల్లించారు. వీరంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. వర్షాభావంతో రైతులు దిక్కుతోచని పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. బావులు, బోర్లు ఉన్న రైతులు ఉన్న కొద్దిపాటి నీటితో ఉద్యాన పంటలు, ఆరుతడి పంటలు సాగు చేసుకునే లక్ష్యంతో ఉన్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోవడంతో ఆయిల్ ఇంజన్‌లు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి. హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ కింద వివిధ మండలాల్లో బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరగడంతో ఆరుతడి పంటలతో పాటు కూరగాయల పంటలు సాగుకు అవకాశం ఏర్పడింది. అయితే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల విషయంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు.

10వేల మంది రైతుల ఎదురుచూపులు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం రైతులు వేలాది రూపాయలు చెల్లించారు. కనెక్షన్ కోసం తమ వాటా సొమ్ము చెల్లించిన రైతులు ఉమ్మడి జిల్లాలో దాదాపు 10వేల మంది వరకు ఉన్నారు. విద్యుత్ లైన్ నుంచి బోరు పాయింటు దగ్గరకు లైన్ వేయడానికి 180 మీటర్ల వరకు ప్రభుత్వం భరిస్తుంది. 11 కేవీ లైన్ వేస్తే 180 మీటర్లకు దాదాపు రూ.60 వేలు, ఎల్‌టీ(లోటెన్షన్) లైన్ వేస్తే రూ.45వేల వరకు ఖర్చు వస్తుంది. అవసరాన్ని బట్టి 11 కేవీ లేదా ఎల్‌టీ లైన్ వేస్తారు. 180 మీటర్లు దాటితే ఆ ఖర్చు రైతు భరించాల్సి ఉంది. 180 మీటర్లు దాటిన రైతులు విద్యుత్ శాఖ అధికారులు రూపొందించిన అంచనాల ప్రకారం తమ వాట సొమ్ము చెల్లించారు. కానీ కనెక్షన్‌లు ఇవ్వడంలో అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. విద్యుత్ శాఖ మంత్రి ఆర్భాటంగా 40 వేల వ్యవసాయ కనెక్షన్‌లు మంజూరు చేస్తూ మొదటి సంతకం చేసినా ఇప్పటి వరకు తదుపరి కార్యాచరణ శూన్యం. వ్యవసాయ కనెక్షన్‌ల కోసం డబ్బులు చెల్లించిన రైతులు 10వేల మంది ఉండగా.. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు మరో 10 వేల మంది ఉన్నారు. ఈ రైతులకు సంబంధించి విద్యుత్ అధికారులు ఎస్టిమేట్లు వేసి డిమాండ్ నోటీసులు ఇస్తే రైతులు తమ వాటా సొమ్ము చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ వ్యవసాయ విద్యుత్‌పై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

> **వైఎస్‌ఆర్‌సీపీ పాలనలో దాదాపు 60,992 ఉచిత కనెక్షన్‌లు విడుదల**
>
> 2019 మే నెలలో వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కనెక్షన్‌లు విడుదల చేయడం ఊపందుకుంది. 2019 జూన్ నుంచి 2024 మార్చి వరకు రికార్డు స్థాయిలో 60వేల ఉచిత విద్యుత్ కనెక్షన్‌లు విడుదల చేయడం విశేషం. 2019లో టీడీపీ ప్రభుత్వం పడిపోయే నాటికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,63,007 కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆ సంఖ్య 2,23,999కి చేరడం చూస్తే వ్యవసాయానికి ఇచ్చిన ప్రాధాన్యత అర్థమవుతోంది. వ్యవసాయానికి రోజుకు 5.2 మిలియన్ యూనిట్లు విద్యుత్ అందించారు. ఉమ్మడి జిల్లాలో లోవోల్టేజీ సమస్యలు, రైతుల నుంచి ఫిర్యాదులు ఉన్న ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్‌లు నిర్మించడం వల్ల వ్యవసాయానికి 9 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు అవకాశం ఏర్పడింది.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెల్దుర్తి మండలంలో ఒక్క రైతుకే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దృశ్యం

మెటీరియల్ నిల్

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడానికి విద్యుత్ శాఖ వద్ద ఎలాంటి మెటీరియల్ లేదు. 40వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇస్తున్నట్లు మంత్రి ప్రకటించినప్పటికీ మెటీరియల్ కోసం ఇంతవరకు పర్చేజ్ ఆర్డర్ పెట్టిన దాఖలాలు లేవు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి విద్యుత్ శాఖ స్టోర్‌లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడానికి మెటీరియల్ కరువైంది. కనెక్షన్ ఇవ్వాలంటే కేబుల్, కండక్టర్, ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం. వీటితో పాటు అనుబంధ మెటీరియల్ తప్పనిసరి. అయితే విద్యుత్ శాఖ స్టోర్‌లో ఒక్క వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు కూడా మెటీరియల్ లేకపోవడం గమనార్హం.

2019-2023 మార్చి వరకు ఉమ్మడి జిల్లాకు విడుదలైన ఉచిత విద్యుత్ కనెక్షన్‌లు

సంవత్సరం	విడుదలైన కనెక్షన్‌లు
2019	11,693
2020	13,074
2021	8,027
2022	18,360
2023	9,838
మొత్తం	60,992

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే దిక్కులేదు

ఒకవైపు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చేందుకు మెటీరియల్ లేదు. పాత కనెక్షన్‌లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వెంటనే ఇచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయింది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. నాటి ప్రభుత్వ ఆదేశాల మేరకు దళారీల ప్రమేయం లేకుండా.. రైతుల నుంచి ఒక్క రూపాయి వసూలు చేయకుండా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం విశేషం. నిబంధనల ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు 24 గంటల సమయం ఉంటుంది. ఇప్పుడు వారం రోజులకు కూడా ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడింది. 2014-15 నుంచి 2018-19 వరకు చంద్రబాబు పాలనలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతులను రోజుల తరబడి తిప్పుకునే పరిస్థితి. మళ్లీ ఇప్పుడు ఆయన ప్రభుత్వంలోనే రైతులు చుక్కలు చూడాల్సి వస్తోంది.

కొత్త కనెక్షన్లు రాబోతున్నాయి



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్న రైతులకు సంబంధించి ఎస్టిమేట్లు వేయడం, డిమాండ్ నోటీసులు ఇవ్వడం చేస్తున్నాం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో డబ్బులు చెల్లించిన రైతులు 10 వేల మంది ఉన్నారు. వీరికి త్వరలోనే మెటీరియల్ ఇచ్చేందుకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. రాబోయే నెల, రెండు నెలల్లో వీరందరికీ విద్యుత్ ఇస్తాం. కొత్త కనెక్షన్లు రాబోతున్నాయి.

– ఎం.ఉమాపతి, ఎస్‌ఇ, విద్యుత్ శాఖ

టీబీ డ్యాంకు పోటెత్తిన వరద



టీబీ డ్యాంలో నిల్వ ఉన్న నీరు

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలో ఇన్‌ఫ్లో మంగళవారం మెరుగు పడింది. ఇన్నాళ్లు వరద నీటి చేరిక హెచ్చుతగ్గులతో నిరాశాజనకంగా ఉండేది.సోమవారం ఇన్‌ఫ్లో కేవలం 16, 142 క్యూసెక్కులు మాత్రమే ఉండగా మంగళవారం 36,170 క్యూసెక్కులకు పెరిగింది. బుధవారం ఉదయం నాటికి 50 వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చే అవకాశాలున్నాయి. శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్కమంగళూరు, వరనాడు తదితర డ్యాం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో డ్యాం ఎగువన నిర్మించిన అప్పర్‌తుంగా ప్రాజెక్ట్ నిండి గేట్లను ఎత్తి 40 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దానికి తోడు రిజర్వాయర్ పరిసరాల్లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుడడంతో ఇన్‌ఫ్లో మరింత పెరుగుతూ వస్తున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు వెల్లడించారు. ప్రారంభంలో డ్యాంకు ఇన్‌ఫ్లో అనుకూల స్థాయికి చేరి ఆ తర్వాత చాలా రోజులు ఇన్‌ఫ్లో తగ్గి రైతులను ఆందోళనకు గురి చేసింది. ఈ సారి ముందుగా వర్షాలు కురవడం, ఇన్‌ఫ్లో పెరగడంతో రైతుల్లో ఆశలు చిగిరిస్తున్నాయి.

రిజర్వాయర్‌లో నీటి నిల్వలు

తుంగభద్ర రిజర్వాయర్‌లో మంగళవారం రాత్రికి 1,633 అడుగుల నీటిమట్టానికి గానూ 1,610 అడుగులు, 105.788 టీఎంసీల నీటి సామర్థ్యానికి 38 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉంది. అందులో రాయబసవన కెనాల్‌కు 195, జిందాల్‌కు 15 క్యూసెక్కులతో కలిపి 211 (అవుట్ ఫ్లో) క్యూసెక్కుల నీరు డ్యాం నుంచి బయటకు వెళ్తుంది.



పేగు బంధానికి కొంగు సంకెళ్లు!



కొన్ని దృశ్యాలను చూస్తే గుండెలు బరువెక్కక మానవు. ఓ తల్లి కడుపుతో ఉంది. అప్పటికే ఆమెకు ఓ కుమార్తె సంతానం. ఆ పసిపాపను చంకన ఎత్తుకోలేక.. అలాగని చేయి పట్టి నడిపించే ఓపిక లేక ఓ చీరను ఆ బిడ్డ నడుముకు చుట్టింది. మరో చివరను తన అరచేతికి చుట్టుకుంది. అలా ఆమె కర్నూలు సి.క్యాంప్ సెంటర్‌లో రోడ్డు వెంట నడుస్తూ.. భిక్షాటన చేస్తూ ముందుకు కదులుతున్న తీరుతో ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చాయి. రెండేళ్లు ఉండీ ఉండక.. తల్లి అడుగులో అడుగులు వేయలేక.. భారంగా కదులుతున్న లేత మనసుకు వేసిన కొంగు సంకెళ్లు.. ఉబికి వస్తున్న కన్నీళ్లు చూస్తే ఏ హృదయమైనా ద్రవించక మానదు.

– డి.హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్,కర్నూలు

అక్రమార్కులను సహించను

సీఐ భూ ఆక్రమణపై విచారించండి

- మద్యం అక్రమ రవాణాదారులకు సహకరిస్తే చర్యలు
- టెలీ కాన్ఫరెన్స్‌లో క్షేత్రస్థాయి అధికారులకు ఎస్పీ హెచ్చరిక

> ☛ ఆస్పరి ప్రాంతంలో ఓ సీఐ భూమి ఆక్రమించుకున్నట్లు వాట్సాప్ కాల్ ద్వారా బాధితులు ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వండి.
> – నిఘా విభాగం అధికారులకు ఎస్పీ ఆదేశం.
>
> ☛ మీ స్టేషన్ పరిధిలో మద్యం రవాణాదారుడు వరుసగా రెండుసార్లు పట్టుబడ్డాడు. తరచూ ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. నిఘా పెట్టి మద్యం అక్రమ రవాణాను ఎందుకు అరికట్టలేకపోయారు.
> – ఇస్వి ప్రాంతంలోని ఓ ఎస్ఐకి ఎస్పీ మందలింపు.
>
> ☛ ఆదోని పట్టణంలోని ఓ స్కూల్ సమీపంలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పటివరకు ఈ సమస్య మీ దృష్టికి రాలేదా? వచ్చి ఉంటే ఎందుకు పరిష్కరించలేదు? సమాధానం ఇవ్వండి.
> – ఆ ప్రాంత సీఐలకు ఆదేశం.
>
> ☛ .. ఉదయం లేచింది మొదలు అర్ధరాత్రి వరకు ఆన్‌లైన్‌లో అలెర్ట్‌గా ఉండాలని సీనియర్ ఇన్‌స్పెక్టర్లకు సూచన... ఇలా పలు సమస్యలపై సంజాయిషీలు సత్వరమే ఆన్‌లైన్‌లో అందేలా ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు.



ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: జిల్లాలోని అన్ని పోలీస్ సబ్ డివిజన్ల అధికారులు, ఎస్‌హెచ్‌ఓలతో ఎస్పీ బిందు మాధవ్ మంగళవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొహర్రం పండుగ సందర్భంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారనే విషయంపై సబ్ డివిజన్ల వారీగా సమీక్షించారు. వేడుకల సందర్భంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. కర్ణాటక ప్రాంతం నుంచి జిల్లాలోకి విచ్చలవిడిగా మద్యం రవాణా అవుతుంటే ఆ ప్రాంత అధికారులు ఏమి చేస్తున్నారంటూ కొంతమంది సీనియర్ ఇన్‌స్పెక్టర్లు, మరికొంతమంది యువ ఎస్ఐలకు సుతిమెత్తగా తలంటినట్లు సమాచారం. ఆస్పరి ప్రాంతంలో ఉన్న ఓ సీఐ పొలం ఆక్రమించినట్లు బాధితుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే విచారణ జరిపించి నివేదిక ఇవ్వాలని నిఘా విభాగం అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో అధికారుల పనితీరు, అక్రమ రవాణాదారులకు సహకారం, విధి నిర్వహణ పట్ల అలసత్వం తదితర అంశాలపై నిఘా విభాగం అధికారులు ఇచ్చిన సమాచారం ఆధారంగా క్షేత్రస్థాయి అధికారుల పనితీరుపై మండిపడినట్లు సమాచారం.

ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టండి

కర్నూలు నగరంతో పాటు జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, నియంత్రణపై దృష్టి పెట్టాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. కర్నూలు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై ఈనెల 14న స్పోర్ట్స్ బైక్ ఢీకొని తాపీ మేస్త్రీ మునిస్వామి మృతిచెందాడు. సమీపంలోని దుకాణంలో మద్యం బాటిల్ తీసుకొని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఇలా తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. ఇంటి దొంగతనాలు, గొలుసు దొంగతనాలు, జేబు దొంగలపై కూడా నిఘా పెంచాలని సూచించారు. అక్రమ రవాణాదారులకు కొంతమంది సహకరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలా చేసి పోలీసు ప్రతిష్టను తగ్గించొద్దని హెచ్చరించినట్లు సమాచారం.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- సుంకేశ్వరి ఘటనపై పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు హెచ్చరించారు. మంగళవారం ఆయన జిల్లాలోని డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లోని ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, సిస్టమ్‌ను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. అలాగే ప్రతి నెల 12 నుంచి 15వ తేదిలోగా, 27 నుంచి 30వ తేదిలోగా డ్రైన్లను క్లీన్ చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యానికి సంబంధించి ఎక్కడైనా సమస్యలు తలెత్తితే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో డయేరియా కేసులు నమోదవడం, నాలుగు సంవత్సరాల చిన్నారి మృతి చెందిన ఘటనకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డీపీఓ చెప్పారు. సంజాయిషీ నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని, ఏపీ సీసీఏ రూల్స్ మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం సుంకేశ్వరి గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు.

గుక్కెడు నీరివ్వండి మహాప్రభో!



కుళాయిలకు నీరు సరఫరా కాకపోవడంతో సిద్దేశ్వర నగర్‌లోని ట్యాంకు వద్ద గుమికూడిన ప్రజలు

- 15 రోజులైనా కుళాయిలకు సరఫరా కాని తాగునీరు
- పట్టించుకోని అధికారులు

ఆలూరు రూరల్: తాగు నీరు లేక పట్టణ ప్రజల గొంతులు ఎండుతున్నాయి. తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని ఆలూరు వాసులు మండిపడుతున్నారు. తాగు నీరు వదిలి రెండు వారాలు అవుతోంది. పంచాయతీ అధికారులకు అడిగితే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై చెబుతున్నారు. మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, పైపు లీకేజీ సమస్య ఉందని ఇలా కారణాలతో సరిపెడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారుల సమన్వయ లోపంతో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. పట్టణంలో మొత్తం 8 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. హాలహర్వి మండలం బాపురం రిజర్వాయర్ నుంచి ట్యాంకుల నీటిని నింపుతారు. వీటి నుంచి ఆయా ఏరియాలకు తాగు నీరు సరఫరా అవుతోంది. బాపురం రిజర్వాయర్‌లో తాగునీరు సమృద్ధిగా ఉన్నా ఇంటింటికి తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు బోరు నీళ్ల కోసం సైకిళ్లు, తోపుడు బండ్ల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో తాగునీరు సరఫరా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

మల్లన్న సేవలో ఎస్‌పీఎఫ్ డీజీ



దీజీ దంపతులకు స్వామివారి ప్రసాదాలను అందిస్తున్న ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసు డైరెక్టర్ జనరల్ సి.ఎం.త్రివిక్రమవర్మ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఎస్‌పీఎఫ్ డీజీ దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. డీజీ దంపతులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో డీజీ దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

ఏపీటీడీసీ ఎస్ఈగా ఈశ్వరయ్య



కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) సూపరింటెండెంట్‌గా బి.ఈశ్వరయ్య నియమితులయ్యారు. కర్నూలు జిల్లాకు చెందిన ఈయన ఏపీటీడీసీ కర్నూలు డివిజన్ ఈఈగా విధులు సమర్థవంతంగా నిర్వహించడంతో ఎస్ఈగా పదోన్నతి లభించింది. ఏపీటీడీసీ హెడ్‌క్వార్టర్స్ విజయవాడ కార్యాలయంలో ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న ఎ.ఎల్.మల్‌రెడ్డి పేరెంట్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లారు. దీంతో బి.ఈశ్వరయ్య ఎస్ఈగా నియమితులయ్యారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగే పనులను పర్యవేక్షించనున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్ చోరీ



హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగిని చోరీ చేశారు. గ్రామ పొలాల్లోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌ను తీసుకొని ఉడాయించారు. ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు ధ్వంసమై పడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను చూసి విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేశారు. విద్యుత్‌శాఖ జేఈ జమ్మన్న, ఎల్ఐ రంగనాథ్, ఎస్ఎం శంకర్, జేఈ లైన్‌మెన్ మంజునాథ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై హాలహర్వి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

సర్వర్ ఢమాల్ !

- భూముల రిజిస్ట్రేషన్ కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిందే
- తరచూ డౌన్ అవుతున్న మెయిన్ లేదా పీడీఈ సర్వర్లు
- నిలిచిపోతున్న భూముల క్రయవిక్రయాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వినియోగదారులు
- ఆన్‌లైన్ సమస్య పరిష్కరించాలని డిమాండ్

కర్నూలు(సెంట్రల్): భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం వినియోగదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. తరచూ సర్వర్ డౌన్ అవుతుండడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో అటు అధికారులు.. ఇటు క్రయ, విక్రయదారులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది. ఫలితంగా ఆస్తుల క్రయ, విక్రయాలు నిలిచిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో రోజుకు కనీసం 500 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. తద్వారా ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. అయితే అనుకోకుండా ఒక్కోసారి రిజిస్ట్రేషన్ మెయిన్ సర్వర్ డౌన్ అవుతోంది. ఒక్కోసారి రెండు, మూడు రోజుల వరకు కూడా పునరుద్ధరణ కావడం లేదు. కొన్నిసార్లు గంటల వ్యవధిలోనే సర్వర్ పునరుద్ధరణ జరిగినా స్పీడ్ ఉండకపోవడంతో రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరగడంలేదు. గత వారంలో గురు, శుక్ర వారాలతోపాటు ఈ వారంలో సోమవారం సర్వర్ సక్రమంగా పనిచేయలేదు. మంగళవారం సర్వర్ పునరుద్ధరణ జరిగినా స్పీడందుకోకపోవడంతో తక్కువ సంఖ్యలోనే రిజిస్ట్రేషన్లు జరిగాయి.

సతాయిస్తున్న పీడీఈ సర్వర్

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పబ్లిక్ డేటా ఎంట్రీ ప్రధానం. ఇందుకోసం స్వయంగా రిజిస్ట్రేషన్ దారులే తమ వివరాలను సర్వర్‌లోకి వెళ్లి నమోదు చేయాల్సి ఉంటుంది. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొని లాగిన్ అయి వివరాలను నమోదు చేసుకొని టైమ్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలి. అయితే ఈ సర్వర్ తరచూ సతాయిస్తుండడంతో క్రయ, విక్రయదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒక్క పీడీఈ డాక్యుమెంట్ కోసం ఒక్కోసారి రెండు, మూడు రోజుల సమయం కూడా పడుతుంది.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

ఇతర పనులన్నీ మానుకోవాల్సిందే

రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే క్రయ, విక్రయదారులకు ఆన్‌లైన్ సర్వర్ షాక్ ఇస్తుండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సివస్తోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సక్రమంగా సాగితే రెండు, మూడు గంటల్లో పూర్తవుతుంది. అయితే సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో రెండు, మూడు రోజులు పనులన్నీ మానుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యవసాయ పనులు ఉన్న రైతులు పనులను మానుకోవాల్సి వస్తోంది. అయితే సర్వర్ సమస్య తరచూ ఉత్పన్నం అవుతున్నా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విక్రయదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు మానుకొని కార్యాలయాల దగ్గర ఎన్ని రోజులు వేచి ఉండాలని ప్రశ్నిస్తున్నారు.

స్పీడ్ లేక సమస్య



గత వారంలో సర్వర్ సమస్య ఉండింది. ప్రస్తుతం ఆ సమస్య లేదు. అయితే స్పీడు లేకపోవడంతో తక్కువ సంఖ్యలో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నాం. ఒక్కటి, రెండు రోజుల్లో అన్ని పరిష్కారం అవుతాయి.

–నాగలింగేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీపీఓలోని అన్ని విభాగాల పనితీరు గురించి సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్, డయల్ 100 రూమ్, డీసీఆర్‌బీ, ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్, ఆయుధాల విభాగం, పోలీస్ క్యాంటీన్, ఫుడ్ కోర్టు, గ్యాస్ గోడౌన్, జిమ్ సెంటర్, వాటర్ ప్లాంట్ తదితర వాటిని పరిశీలించి అక్కడున్న అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, పీసీఆర్ సీఐ శివశంకర్, డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్ బాబు, కోర్టు మానిటరింగ్ సీఐ రామయ్యనాయుడు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు ఉన్నారు.

ఆ సర్కిల్ పోస్టింగ్‌కు రూ.10 లక్షల ఆఫర్

కర్నూలు: కర్నూలు పోలీస్ సబ్ డివిజన్‌లోని అత్యంత ప్రాధాన్యత కలిగిన సర్కిల్ పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధి వద్దకు వెళ్లి అడిగినంత ముట్టజెప్పేందుకు ముందుగా రూ.10 లక్షలు ఓ ఇన్‌స్పెక్టర్ ఆఫర్ ఇచ్చిన వ్యవహారం పోలీసు, టీడీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా ఆ ఇన్‌స్పెక్టర్ నగర పరిధిలోని మరో సర్కిల్‌లో పనిచేసి బాగానే వెనకేసుకున్నాడని ఆ సర్కిల్ సీటు ఆశిస్తున్న మరో ఇన్‌స్పెక్టర్ వాదన. ఇదే విషయం ఆయనకు పరిచయం ఉన్న టీడీపీ నేత ద్వారా రూ.10 లక్షల ఆఫర్ అంశాన్ని చినబాబుకు చేరవేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ అధికారికి పోస్టింగ్ దక్కుతుందా? లేదా? అని ఇటు టీడీపీ, అటు పోలీసు వర్గాల్లో చర్చకు తావిస్తోంది. నూతనంగా ఏర్పాటైన మరో పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఆదాయం ఉన్న సర్కిల్ పోస్టింగ్ కోసం మరో సీనియర్ అధికారి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధికి భారీ మొత్తంలో ముడుపులు ముట్టజెప్పేందుకు సంసిద్ధత వ్యక్తం చేసి ఇంటి చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఆయన అనుచరులే ఆ ఇన్‌స్పెక్టర్‌ను వ్యతిరేకిస్తూ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో చినబాబు ఆ ప్రజాప్రతినిధులతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఎన్నికల ముందు పొరుగు జిల్లాలకు బదిలీపై వెళ్లిన పోలీసు అధికారులు కూడా తమకు అనుకూలమైన టీడీపీ నేతల ద్వారా విలువైన కుర్చీల్లో కూర్చునేందుకు ప్రయత్నిస్తున్నారు. కర్నూలు జిల్లాలో అవకాశం లేకుంటే పక్క జిల్లా నంద్యాల్లోనైనా పరపతి ఉండే కుర్చీ కోసం వెంపర్లాడుతున్నారు. ఏదో విధంగా మంచి పోస్టింగ్ కొట్టేద్దామని గెలిచిన ఎమ్మెల్యేల ఇళ్లకు తమ సన్నిహితుల ద్వారా క్యూ కడుతున్నారు. డబ్బులు తీసుకుని పోస్టింగ్ ఇచ్చేందుకు ఎమ్మెల్యేలు సిఫారసు చేస్తున్నారని టీడీపీ శ్రేణులు నేరుగా అధిష్టానానికి ఫిర్యాదు చేయడం ఆ పార్టీలో కూడా చర్చనీయాంశంగా మారింది. నూతన ఎస్పీ పదవీ బాధ్యతలు చేపట్టినందున మరో వారం రోజుల్లో సీఐల బదిలీలు జరుగుతాయని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ముఖ్యమైన కొన్ని సర్కిళ్ల పోస్టింగుల కోసం పైరవీలు జోరందుకోవడం గమనార్హం.

ఓ అధికారి వసూళ్ల పర్వం

ఎన్నికల వేళ సిబ్బంది విధుల నిర్వహణకు తాను భారీగా ఖర్చు చేయాల్సి వచ్చింది. అధికారులకు వాహనాలు సమకూర్చాల్సి వచ్చింది. అందుకు సంబంధించిన డబ్బులు ఎలాగైనా రాబట్టుకోవాలని ఓ పోలీసు అధికారి వసూళ్ల పర్వానికి తెర లేపారు. ఇందుకు ఆ స్టేషన్ పరిధిలోని కొందరు రియల్ ఎస్టేట్, వాణిజ్య వ్యాపారుల నుంచి ముక్కుపిండి మరీ డబ్బు వసూలు చేస్తున్న ఘటన పోలీసు శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

భ్రామరీకి బంగారు హారం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి హైదరాబాద్‌కు చెందిన నాగోజీ వెంకటేశ్వరకుమార్, శివకుమారి దంపతులు మామిడి పిందెల డిజైన్‌తో కూడిన బంగారు హారాన్ని సమర్పించారు. మంగళవారం దేవస్థాన పరిపాలన భవనంలో ఈఓ డి.పెద్దిరాజుకు బంగారు హారాన్ని అందించారు. ముత్యాలు, ఎర్రరాళ్లు, పచ్చరాళ్లు, తెల్లరాళ్లతో కూడిన ఈ బంగారు హారం మొత్తం బరువు 120 గ్రాములని, విలువ రూ.8.35 లక్షలు అయినట్లు దాతలు తెలిపారు. దాతకు స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను, సంబంధిత రసీదును అందించి సత్కరించారు.



దేవస్థాన ఈఓకు బంగారు హారాన్ని అందిస్తున్న దాత

రేషన్ బియ్యం స్వాధీనం

వెలుగోడు: వెలుగోడు–నంద్యాల ప్రధాన రహదారిలోని రాజమాత రైస్ మిల్ సమీపంలో మంగళవారం 130 బస్తాల(50 కేజీల సంచులు) రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ భూపాలుడు తెలిపిన వివరాలు.. బియ్యం అక్రమంగా తరలుతుందనే సమాచారంతో సిబ్బందితో వెళ్లి సోదాలు నిర్వహించారు. ఏపీ 16 టీయూ 4335 లారీని ఆపి తనఖీ చేయగా 130 బస్తాల రేషన్ బియ్యం బయటపడింది. లారీని సీజ్ చేసి రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు. షేక్ మహ్మద్ అనే వ్యక్తి బియ్యం తమవే అని ఒప్పుకోవడంతో అతనితోపాటు లారీ డ్రైవర్ సుంకేంద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు.



పట్టుబడిన లారీని పోలీసు స్టేషన్ వద్ద ఉంచిన దృశ్యం

అతిసారం విజృంభిస్తున్నా పట్టదా?

- నుంకేశ్వరి గ్రామంలో వ్యాధి విజృంభణపై హెల్త్ డైరెక్టర్ ఫోన్ చేసి చెబితే గానీ తెలుసుకోలేని స్థితిలో జిల్లా అధికారులు
- ఉన్నతాధికారుల ఆదేశాలతో హుటాహుటిన వైద్య సేవలు

కర్నూలు(హాస్పిటల్): మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధి ప్రబలడంపై రాష్ట్ర ఉన్నతాధికారులు ఫోన్ చేసి చెబితే గానీ జిల్లా అధికారులకు సమాచారం తెలియని పరిస్థితి నెలకొంది. స్థానికంగా ఉన్న మెడికల్ ఆఫీసర్‌కు కూడా ఈ విషయం తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. క్షేత్రస్థాయిలో వైద్య ఉద్యోగుల పనితీరు ఎలా ఉందో ఈ సంఘటనను బట్టి అర్థం అవుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుంకేశ్వరి గ్రామంలో గత కొన్ని రోజులుగా అతిసార వ్యాధిగ్రస్తుల కేసులు బయటపడుతున్నాయి. వారు స్థానికంగా ఉన్న వైద్యులతో పాటు మంత్రాలయం, ఆదోనికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఆశాలు, ఏఎన్ఎంలు ఇంటింటి సర్వే చేసి డయేరియా కేసులుంటే వారికి తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. అయితే వారు ఆ గ్రామానికి వెళ్లినట్లు కూడా లేదు. వారు వెళ్లి ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌కు సమాచారం చెప్పేవారు. సదరు మెడికల్ ఆఫీసర్ జిల్లా అధికారులకు చెప్పి ఆ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసేవారు. ఈ స్థితిలో అటు క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది, ఇటు మండల స్థాయి వైద్యాధికారులకు ఏ మాత్రం సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధి విజృంభణ గురించి తెలియదని సమాచారం. సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ జిల్లా అధికారులకు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. అప్పటికీ గానీ వారికి తెలియలేదు. వెంటనే సదరు గ్రామాన్ని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో పాటు డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ హుటాహుటిన వెళ్లారు. బాధితులను ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. డయేరియా నివారణకు అవసరమైన చర్యలను తీసుకున్నారు. మంగళవారం సైతం డీఎంహెచ్ఓ అదే గ్రామంలో ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

ఆలూరు రూరల్: క్రికెట్ ఆడుతూ బంతి కోసం గోడ ఎక్కిన బాలుడికి విద్యుత్ తీగలు తాకడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల–1 ఆవరణంలో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదం జరిగింది. కోయనగర్ కాలనీకి చెందిన ఈరమ్మ, రఘుల కుమారుడు అభిరాం స్థానిక జెడ్పీ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం మొహర్రం సందర్భంగా ఐచ్ఛిక సెలవు కావడంతో స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడేందుకు పాఠశాల గ్రౌండ్‌కు వెళ్లాడు. క్రికెట్ ఆడుతుండగా బంతి వంటశాల పైకప్పుపై పడడంతో తెచ్చేందుకు అభిరాం గోడ ఎక్కాడు. అక్కడ వేలాడుతున్న విద్యుత్ తీగలు తలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై తల పైభాగం, ఎడమ పాదానికి గాయాలయ్యాయి. గాయపడిన బాలుడికి ఆలూరు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఓపీడీ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు.

సైబర్ నేరగాళ్ల వలలో మెడికల్ రెప్

కర్నూలు: కర్నూలు శివారులోని బాలాజీ నగర్‌లో నివాసముంటున్న మెడికల్ రెప్ సురేష్ సైబర్ నేరగాళ్ల వలలో పడి భారీగా నష్టపోయాడు. ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభం వస్తుందని చెప్పి ఆశ కల్పించి సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. వాట్సాప్ ద్వారా లింక్ పంపి దాని ద్వారా డబ్బులు పంపమని వల వేయగా నమ్మిన సురేష్ గత ఏప్రిల్, మే నెలల్లో విడతల వారీగా రూ.28 లక్షలు జమ చేశాడు. అందుకుగాను రూ.60 లక్షలు వస్తుందని ఆశ పెట్టి మరికొంత డబ్బు పంపాలని కోరగా అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు తెలిపారు.

మిరపలో సస్యరక్షణ పద్ధతులపై అవగాహన

నంద్యాల(సెంట్రల్): మిరప సాగు చేసే రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు సూచించారు. మంగళవారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నంద్యాల, ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని మండలాల వీఏఏ, వీహెచ్ఏలకు డిజిటల్ గ్రీన్ సంస్థ, ఉద్యానశాఖ సంయుక్తంగా ఈ–మిర్చి 2.0 ప్రాజెక్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ కో–ఆర్డినేటర్ వెంకటగౌడ్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు ద్వారా మిరప రైతులందరికీ పంట పొలాల్లోని సమస్యలకు సలహాలు, సూచనలు వీడియోల రూపంలో మొబైల్‌కు అందుతాయన్నారు. ప్రాజెక్టు మేనేజర్ సురేందర్ మాట్లాడుతూ.. మిరప పంటలో భూసార పరీక్షలు, నాణ్యతా పరీక్షలు, మార్కెటింగ్ అనుసంధానం డిజిటల్ గ్రీన్ సంస్థ ద్వారా కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం నంద్యాల ఉద్యానశాఖాధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. ఉద్యానశాఖ ద్వారా లభించే పథకాలు, మార్కెటింగ్ సదుపాయాల గురించి వివరించారు. పంటలో చీడపీడల నివారణ, సమగ్ర సస్యరక్షణ, ఆధునిక పద్ధతులను తెలియజేశారు. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ.. పంటను వీఏఏ, వీహెచ్ఏలు ఎప్పటికప్పుడు సందర్శించి రైతులకు ఆధునిక సాగు పద్ధతులు తెలియజేసి, ఉత్పాదకతను పెంచి నాణ్యమైన దిగుబడులు సాధించేలా సలహాలివ్వాలని సూచించారు. జిల్లా ఉద్యాన సాంకేతిక అధికారి హరినాథ్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి యూ.నాగరాజు

డీఎఫ్‌సీఎస్ అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం



జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామలను కలిసిన డీఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా మత్స్య సహకారసంఘం (డీఎఫ్‌సీఎస్) అధ్యక్షుడిగా కర్నూలు మండలం ఈ–తాండ్రపాడు గ్రామానికి చెందిన బీఎస్ నవీన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు.. ఎన్నికల అధికారి డి.పామన్న మంగళవారం సంఘానికి అధ్యక్ష ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఐటీడీసీ కార్యాలయంలో జరిగిన ఎన్నిక కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకారం సంఘం డైరెక్టర్లు అధ్యక్షుడిగా నవీన్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా కొనసాగిన గూడూరు శ్రీనివాసులు పదవీ కాలం ముగియడంతో ఖాళీ అయిన అధ్యక్ష స్థానం నవీన్‌కుమార్ ఎన్నికతో భర్తీ అయ్యింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు పెద్ద వీరేష్, డైరెక్టర్లు భాస్కర్, మల్లీశ్వరుడు, నాగశేషులు, పోతుల శేఖర్, వెంకటేశ్వర్లు, నగేష్, మద్దిలేటి, తాజామాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాసు లు తదితరులు మత్స్యశాఖ ఉపసంచాలకులు శ్యామల, మత్స్య అభివృద్ధి అధికారి స్వర్ణలతను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతన అధ్యక్షుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర మత్స్య సహకార సంఘం అధ్యక్ష పదవిని ఈసారి కర్నూలు జిల్లాకు కేటాయించే విధంగా రాష్ట్ర సంఘంపై ఒత్తిడి తెస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్నేహితుల దుర్మరణం






బడెద్దుల సురేష్ (ఫైల్) మణికుమార్ (ఫైల్)

పత్తికొండ రూరల్: పత్తికొండ మండల పరిధిలోని దూదేకొండ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దూదేకొండకు చెందిన కృష్ణ, చంద్రమ్మల కుమారుడు బడెద్దుల సురేష్ (18), గోపాల్, శివమ్మల కుమారుడు మణికుమార్ (19) దుర్మరణం పాలయ్యారు. వివరాలు.. గత కొన్ని సంవత్సరాల కిందట చదువు మానేసిన సురేష్, ఇంటర్మీడియెట్ సెకండియర్ చదువుతున్న మణికుమార్ ఇద్దరూ స్నేహితులు. వీరిద్దరూ పత్తికొండలోని ఓ సప్లయర్స్ షాపులో వర్కర్లుగా పనిచేస్తుండేవారు. మొహర్రం పండుగ కావడంతో పత్తికొండకు పెద్దసరిగెత్తు వేడుకలో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. మలుపు వద్ద ఎద్దులబండిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడగా గ్రామస్తులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఇద్దరు యువకులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మరికొద్దిసేపట్లో ఇంటికి చేరుకుంటారన్న తమ కుమారులిద్దరూ విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదంపై విచారణ చేస్తున్నారు.

సోదరిని చూసి వస్తూ..



మృతిచెందిన మునెప్ప

దేవనకొండ: మండలంలోని వీరంపల్లి స్టేజి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన కట్టెల మునెప్ప(28) ఏపీ39 ఎఫ్ఎస్5851 నంబరు గల డార్క్ 200 సీసీ పల్సర్ బైకుపై దేవనకొండ మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన సోదరిని చూడడానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వీరంపల్లి స్టేజి వద్ద కోడుమూరు నుంచి పత్తికొండకు వెళ్తున్న లారీ(ఏపీ21టీఈ5166)ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బైకు నుజ్జునుజ్జయ్యింది. యువకుడికి ఇంకా పెళ్లి కాలేదు. మృతుడి తండ్రి పాపారాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దేవనకొండ సీఐ శ్రీనివాసులు తెలిపారు. మునెప్ప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు

- ఆత్మకూరులో 49.6 మి.మీ. వర్షపాతం నమోదు
- బవనాశి, గుండ్లవాగులో ఉధృతంగా నీటి ప్రవాహం



పొంగిపొర్లుతున్న బవనాశి వాగు



ఏకలవ్య నగర్‌లో ఇళ్లలోకి నీరు చేరడంతో బయటికి వచ్చిన స్థానికులు



నీటమునిగిన మొక్కజొన్న పైరు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణం, మండలంతో పాటు నల్లమల అటవీ ప్రాంతంలో భారీ నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. నాలుగు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలోని కొత్తరామాపురం, నల్లకాల్వ, కరివేన, కురుకుంద, అమలాపురం, కృష్ణాపురం గ్రామాల్లో మే నెలలో అరకొరగా సాగుచేసిన మొక్కజొన్న పైర్లకు వర్షం వల్ల ఏమాత్రం నష్టం లేకుండా ఏపుగా పెరుగుతున్నాయి. అయితే గత పది, పదిహేను రోజులక్రితం మొక్కజొన్న విత్తనం వేసిన రైతులు ప్రస్తుత వర్షాలకు పంటను నాశనం చేసి మళ్లీ విత్తనం వేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే పత్తి, కంది తదితర పంటలు దెబ్బతిన్నాయి. మంగళవారం 49.6 మి.మీ వర్షపాతం నమోదుకాగా మండలంలోని బవనాశి, సుద్దవాగు, గుండ్లకమ్మ వాగులు పొంగిపొర్లాయి. పట్టణంలోని ఏకలవ్యనగర్, లక్ష్మీనగర్, రహంతుల్లానగర్ తదితర కాలనీల్లో వర్షపునీరు ఇళ్లలోకి చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో కో–ఆప్షన్ సభ్యుడు రషీద్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారిఫ్ ఆధ్వర్యంలో ఉదయం వర్షపు నీటిని మళ్లించేందుకు ప్రొక్లెయిన్‌లతో పనులు చేపట్టారు. నీటిని మళ్లించి గుండ్లకమ్మ వాగుకు చేరేలా చర్యలు చేపట్టారు. మండలంలో సోమవారం 12.4 మి.మీ. ఆదివారం 14.6 మి.మీ. శనివారం 9.8 మి.మీ వర్షం కురిసింది. జూలై నెల సాధారణ వర్షపాతం 167 మి.మీ కాగా ఇప్పటికే 160.2 మి.మీ వర్షం కురిసింది. ఈ యేడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు సాధారణం కంటే రెండింతలు అధికంగా వర్షపాతం నమోదు కావడం విశేషం. భారీ వర్షాలకు నల్లకాల్వ, కరివేన, వడ్లరామాపురం, ఇందిరేశ్వరం గ్రామాల్లోని చెరువులకు వర్షపునీరు చేరి కళకళలాడుతున్నాయి. బోరుబావుల్లో జలమట్టం పెరిగింది.